క్లుప్తంగా

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



తోట్లవల్లూరు: దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తోట్లవల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయి ప్రసన్న తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో దోమల నివారణకు వినియోగించే గంబూసియా చేపలను మంగళవారం ఆమె విడుదల చేశారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో మురుగు గుంటలు, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో గంబూసియా చేపలను వదిలామన్నారు. నిల్వ నీటిలో ఉన్న లార్వాను ప్రాథమిక దశలోనే గంబూసియా చేపలు తినేయటం వలన దోమల ఉధృతి తగ్గటంతోపాటు పెరుగుదల నిలిచిపోతుందన్నారు. ఎంపీహెచ్ఈఓలు మాణిక్యం, శ్రీధర్, ఆరోగ్య కార్యకర్త కమాలాక్షి పాల్గొన్నారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకొంటున్నట్లు సర్పంచ్ జంపాన ధనలక్ష్మి తెలిపారు. మండలంలోని తాడంకి గ్రామంలో మంగళవారం సర్పంచ్ ధనలక్ష్మి, ఎంపీటీసీ కూచిపూడి శ్రీలక్ష్మితో కలిసి వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. దోమలు వ్యాప్తి చెందకుండా దోమల మందు పిచికారీ చేశారు. మలేరియా అధికారి సర్వారాయుడు, వైద్య సిబ్బంది రమణమూర్తి, లావణ్య పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ



పెదపారుపూడి: మండల కేంద్రమైన పెదపారుపూడిలోని ప్రాథమిక పాఠశాల మెయిన్‌లో దివ్యాంగులకు మంగళవారం ఫిజియోథెరపీ నిర్వహించారు. ఫిజియోథెరపిస్ట్ కామరాజు ఆరుగురు చిన్నారులకు థెరపీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి వారం క్రమం తప్పకుండా థెరపీ చేయిస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ఇంటి వద్ద కూడా వ్యాయామాలు చేయాలని సూచించారు. ఐఆర్పీలు హరిబాబు, కిషోర్‌బాబు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన



గుడివాడటౌన్: స్థానిక ఎన్టీఆర్ కాలనీ నుంచి కొత్తపేటకు వెళ్లే రహదారి సీసీ రోడ్డు నిర్మాణం పనులను మంగళవారం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండల హనుమంతరావు భూమి పూజ నిర్వహించారు. రూ.2.5 లక్షల నిధులతో సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.ఆంజనేయ ప్రసాద్, చుండూరు శేఖరు, రమణారావు, పెద్దు కిషోర్ పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి

పమిడిముక్కల: బడి ఈడు పిల్లలను గుర్తించి నూరు శాతం పాఠశాలల్లో చేరే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సీహెచ్ విఠల్ పాల్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓ-1 పద్మారాణి, ఎంఈఓ-2 శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లు, సీఆర్పీలకు బడి ఈడు పిల్లల నమోదుపై సమావేశం నిర్వహించారు. మండలంలో మొత్తం 1,081 మంది బడి ఈడు పిల్లలు ఉన్నారని చెప్పారు. సచివాలయాల పరిధిలో బడి ఈడు పిల్లలను గుర్తించి, వారంతా పాఠశాలల్లో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఐదు నుంచి 18 ఏళ్ల వయస్సు వారిని గుర్తించి, వారి తల్లిదండ్రులకు విద్య ప్రాముఖ్యతను వివరించాలన్నారు. అనంతరం ఎంపీడీఓ, ఎంఈఓలతో కలిసి మర్రివాడ, మంటాడ, తాడంకి సచివాలయాలకు వెళ్లి ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌లకు పలు సూచనలిచ్చారు. పిల్లల నమోదు ప్రక్రియను పరిశీలించారు. నూరు శాతం పిల్లల నమోదు పూర్తి చేయాలని చెప్పారు.

డ్రాప్ అవుట్స్ విద్యార్థులు తిరిగి చేరండి

కైకలూరు: కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలతో డ్రాప్ అవుట్స్‌ను గుర్తించి వారిని బడి, కాలేజీల్లో చేర్పించడానికి మిషన్ గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్(ఎంజీఈ) కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతోందని కైకలూరు జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.రవీంద్ర చెప్పారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా కైకలూరు మండలం ఆచవరం, కైకలూరులో చదువు ఆపివేసిన ఐదుగురిని మంగళవారం గుర్తించి వారి తల్లిదండ్రులతో చర్చించామన్నారు. వారిని మళ్లీ కాలేజీకి పంపించాలని కోరామన్నారు. కొందరి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సానుకూలత వ్యక్తమైందని రవీంద్ర తెలిపారు. మిగిలిన వారితో మరోసారి మాట్లాడతామని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు షాదిక్ హుస్సేన్, పి.రవి, బీమరాజు కుమార్, రామ అప్పారావు పాల్గొన్నారు.

పశు పోషకులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

- పాడి పశువులకు ఆరోగ్య కార్డులు
- మనుషులతో సమానంగా పశువులకు ఆరోగ్య బీమా
- ఇనాఫ్ ట్యాగ్ ఏర్పాటు



పశు ఆరోగ్య సంరక్షణ కార్డు(నమూనా)

గుడివాడరూరల్: పశు పోషకులకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తూ, అండగా నిలుస్తోంది. పశువులను పోషించే పాడి రైతులకు పశువులకు ప్రాణహానీ కలిగినా, ఆరోగ్య పరమైన సమస్యలు తలెత్తినా మనుషులు మాదిరిగానే వైద్యం అందించేందుకు, పశువులను కోల్పోయిన రైతులకు ఆర్థిక సహాయం చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా పశువులకు ఇనాఫ్ ట్యాగ్ పథకాన్ని ప్రవేశపెట్టి పశు పోషకులకు ఆర్థిక భరోసా కలిస్తోంది. మనుషులకు ఆరోగ్యశ్రీ, వైఎస్సార్ బీమా,108, 104 పథకాలు మాదిరిగా పశువులకు సైతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చి పశు సంచార వాహనాలు, పశువులను పోషించే రైతులకు బీమా సౌకర్యాలను ఏర్పాటు చేసి పశు పోషకులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. పాడి పశువులకు ఇనాఫ్ ట్యాగ్‌లు వేసే కార్యక్రమాన్ని గత ప్రభుత్వం ప్రారంభించినా పకడ్బందీగా అమలు చేయకుండా గాలికి వదిలేసింది. దీంతో ప్రకృతి వైపరీత్యాలు, అనారోగ్యాలతో పాడి పశువులు మృత్యువాత పడితే పశు పోషకులకు ఎటువంటి ఆర్థికపరమైన భరోసా లేకపోవడంతో పశు పోషకులు ఆర్థికంగా నష్టపోయేవారు. పశువులకు సరైన వైద్య సౌకర్యాలు లేకపోవడంతో సొంత నగదుతో పశువులకు వైద్యం చేయించుకునే దుస్థితి ఉండేది.

సులభతరంగా పథకాల వర్తింపు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పశువుల క్షేమం, పశు పోషకులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఇనాఫ్ ట్యాగ్ పథకాన్ని సమర్థవంతంగా అమలులోకి తీసుకువచ్చింది. ఈ పథకంలో భాగంగా పశువులకు ఇనాఫ్ ట్యాగ్ కార్యక్రమాన్ని ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలకు ట్యాగ్‌లు వేయడం పూర్తి చేసి 2020 జూలై 8వ తేదీన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి, రైతు దినోత్సవం రోజున రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించారు. పూర్తిస్థాయిలో అన్ని గ్రామాల్లో ఉన్న పశువులకు నిరంతరం ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుంది. పశువులకు ఏమైనా పథకాలు, బీమా వర్తించాలంటే ట్యాగ్‌లు తప్పనిసరి. దీని ద్వారా పశు పోషకులకు లబ్ధి చేకూరుతుంది. పశువులకు ప్రభుత్వ పథకాలు వర్తింప చేసి పాడి రైతులను ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇనాఫ్(ఇన్‌ఫర్మేషన్ నెట్‌వర్క్ ఫర్ యానిమల్ ప్రొడక్టవిటీ అండ్ హెల్త్) ట్యాగ్‌ను అమల్లోకి తెచ్చాయి. పశు వైద్య సిబ్బంది ఆయా గ్రామాల్లో పర్యటించి 12 అంకెల ఇనాఫ్ సంఖ్యను పశువుల చెవికి ట్యాగ్‌గా వేస్తారు. దీని ద్వారా పశువులకు పథకాలను వర్తింపచేసేందుకు సులభతరం అవుతుందని పశు వైద్యాధికారులు చెబుతున్నారు.

వివరాలన్నీ ఆన్‌లైన్‌లో...

పశువులకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు ఇనాఫ్ ట్యాగింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఐఎన్ఏపీహెచ్ వెబ్‌సైట్‌లో పశు ఆధార్ సంఖ్య నమోదు చేసి దానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకోవచ్చు. ప్రభుత్వం అందించే సమతుల ఆహార పథకం అమలు చేయడానికి ఈ సంఖ్య ఉపయోగపడుతుంది. పశువు ఆరోగ్య పరిస్థితి, వ్యాధి నివారణ టీకాల వివరాలు, కృత్రిమ గర్భదారణ, జాతి ఎదుగుదలను చూడవచ్చు. పాలు, పేడ నమూనాలు పరిశోధనల్లో పరీక్షించేటప్పుడు సంఖ్యను ఉపయోగిస్తే ఫలితాలు సమగ్రంగా ఉంటాయి. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు మృతి చెందితే అధికారులు ఇచ్చే మరణ నివేదిక ఆధారంగా ఆయా రైతులకు నష్టపరిహారం ప్రభుత్వం నుంచి అందుతుంది.

ఆరోగ్య కార్డులు అందజేత..

గుడివాడ నియోజకవర్గంలో మొత్తం 19,672 ఆవులు, గేదెలకు, 1,104 మేకలు గొర్రెలకు ఆరోగ్య కార్డులను ఇప్పటికే అందజేశారు. గుడివాడ మండలానికి సంబంధించి 6,930 ఆవులు, గేదెలకు, గుడ్లవల్లేరు మండలంలో 6,742, నందివాడ మండలంలో 6వేల ఆవులు, గేదెలకు కార్డులు పంపిణీ చేశారు. అదే విధంగా గుడివాడ రూరల్ మండలంలో 346 గొర్రెలు, మేకలకు, గుడ్లవల్లేరు 358 గొర్రెలు, మేకలకు, నందివాడ 400 గొర్రెలు, మేకలకు ఆరోగ్య కార్డులు అందించారు. కాగా ఒక రైతుకు ఎన్ని గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు ఉన్న వాటి అన్నింటిని అనుసంధానం చేస్తూ ఒకే ఆరోగ్య కార్డు అందజేస్తున్నారు. ఈ కార్డుల్లో పూర్తి వివరాలు నమోదు చేసి నట్టల నివారణ మందు, బ్రూసెల్లా వ్యాధులకు టీకాలు, గాలికుంటు నిరోధక టీకాలు, గొంతు జబ్బువాపు వ్యాధులకు సంబంధించి మందులను ఎప్పుడు వాడాలో తెలియజేస్తారు. పాల ఉత్పత్తి, గర్భదారణ తదితర వివరాలను కూడా నమోదు చేస్తారు. దీని ద్వారా పశువులకు సంబంధించి మొత్తం వివరాలను ఇనాఫ్ సంఖ్య ద్వారా తెలుసుకోవడం సులభతరం అవుతుంది.



మల్లాయపాలెంలో పశు ఆరోగ్య కార్డును అందజేస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని(ఫైల్)

పాడి రైతులకు ఎంతో మేలు..



పశువులకు వేసే ఇనాఫ్ ఆధార్ సంఖ్యతో పాడి రైతులకు అనేక ఉపయోగాలున్నాయి. ప్రతి మూగ జీవికి ట్యాగ్‌లు తప్పనిసరిగా ఉంటేనే ప్రభుత్వ పథకాలు అందుతాయి. పశువులు మృతి చెందితే వాటికి కేటాయించిన ఆధార్‌సంఖ్య ద్వారా పశు బీమా వర్తిస్తుంది. పాడి రైతులు అందరూ తమ పశువులకు గుర్తింపు సంఖ్యను తప్పనిసరిగా వేయించుకోవాలి. ఇంకా వేయించుకోని పాడి రైతులు ఎవరైనా ఉంటే, ఇప్పటికే వేసిన ట్యాగ్‌లు ఊడిపోయినట్లయితే ఆయా ప్రాంతాల్లో ఉన్న పశు వైద్యులను, సిబ్బందిని సంప్రదించి వెంటనే వేయించుకోవాలి. పశు పోషకులు ఇనాఫ్ ట్యాగ్‌పై అవగాహన పెంచుకోవాలి.

–వి.హనుమంతరావు, పశు వైద్యాధికారి



ఆవుకు వేసిన ట్యాగ్(ఫైల్)

జగనన్న కాలనీలో వీధిలైట్ల ఏర్పాటు

మండవల్లి: మండలంలోని కానుకొల్లు జగనన్న కాలనీలో వీధిలైట్లను సర్పంచ్ నాగదాసి థామస్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. కాలనీవాసులకు ఇబ్బందులు కలగకుండా వీధి దీపాలు ఏర్పాటు చేశామన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు పుట్టి మీనా కుమారి, వార్డు సభ్యు డు విష్ణుమూర్తుల రాంబాబు, కార్యదర్శి రత్నకుమారి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడటౌన్: ఫ్లై ఓవర్ నిర్మాణంలో భాగంగా పామర్రులో విద్యుత్ స్తంభాల తొలగిస్తున్నందున బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖాధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆటోనగర్, లక్ష్మీనగర్ కాలనీ, బ్యాంక్ కాలనీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

కౌలు వేలం ద్వారా ఆలయానికి రూ.1.41 లక్షల ఆదాయం

పామర్రు: స్థానిక శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానానికి చెందిన సర్వే నంబర్ 111లోని 5.93 ఎకరాల మాగాణి భూమికి మంగళవారం స్థానిక ఆలయంలో బహిరంగ కౌలు వేలం నిర్వహించారు. వేలంను దేవదాయ, ధర్మదాయ అధికారి సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించామని ఆలయ మేనేజర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. వేలంలో భూమిని హెచ్చు కౌలు పాడిన వల్లభనేని వేణుగోపాలరావు దక్కించుకున్నారన్నారు. మూడు ఏళ్ల పాటు ఉండే ఈ పాటలో ఏడాదికి రూ.47 వేల చొప్పున రూ.1.41 లక్షలు చెల్లిస్తారని చెప్పారు. ధరావత్తుగా రూ.10 వేలు చెల్లించి ముగ్గురు వేలంలో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఆర్.ప్రసాద్, ఆలయ సిబ్బంది కూసం ప్రభాకరరెడ్డి, శ్రీనివాసరావు, మధు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలతో ఊళ్ల నిర్మాణం

- ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ
- కేడీసీసీ చైర్‌పర్సన్ పద్మావతి చేతుల మీదుగా చెక్కుల పంపిణీ
- వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్ లబ్ధిదారులకు రూ.2 లక్షల రుణం



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ వెంకటరమణ, కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ పద్మావతి

కైకలూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో జగనన్న కాలనీల పేరుతో ఊళ్లు నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. కైకలూరు జగనన్న గ్రీన్ విలేజ్‌లో సహకార బ్యాంకు గృహలక్ష్మి రుణమేళా పథకం ద్వారా 157 మంది లబ్ధిదారులకు రూ.2.50 కోట్ల నమూనా చెక్కును కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(కేడీసీసీ) చైర్‌పర్సన్ తాతినేని పద్మావతితో కలిసి మంగళవారం అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ రాష్ట్రంలో మొదటిసారి గృహ నిర్మాణానికి సహకార బ్యాంకు ఒక్కో లబ్ధిదారునికి రూ.2 లక్షలు రుణం అందిస్తోందన్నారు. జిల్లా మొత్తం ఇదే ఒరవడి కొనసాగించాలని సూచించారు. సీఎం ఆదేశాలతో 22ఏ ప్రభుత్వ భూములకు సైతం బ్యాంకులు రుణాలు అందిస్తున్నాయన్నారు. గ్రీన్ విలేజ్ కోసం 100 ఎకరాల భూమిని సేకరించామన్నారు. దాదాపు రూ.20 కోట్లతో లేఅవుట్‌లో బుసక మట్టితో మెరక చేయించామని చెప్పారు. ఒక్క జగనన్న కాలనీలోనే రూ.8 కోట్లతో రోడ్లు, రూ.14 కోట్లతో డ్రెయిన్లు, రూ.5.19 కోట్లతో తాగునీరు, 3 ఎకరాల్లో గ్రీన్ పార్కు, ఇంటింటికీ కుళాయి ఇలా అనేక సౌకర్యాలు గ్రీన్ విలేజ్‌లో కల్పించామన్నారు. సహకార బ్యాంకులు ప్రైవేటు బ్యాంకుల కంటే తక్కువ వడ్డీకి రుణాలు అందించాలన్నారు.

ప్రతి మహిళను లక్షాధికారిని చేయడమే లక్ష్యం

ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఇతర గ్రామాల ప్రజలకు స్థలాలు కేటాయించడం అభినందనీయమన్నారు. తక్కువ ఖర్చులో కొత్త టెక్నాలజీతో కాంట్రాక్టర్ ఇంటిని నిర్మిస్తున్నారన్నారు. సహకార బ్యాంకు నుంచి తీసుకున్న రుణం ఐదేళ్లలో నెలకు రూ.4,400 చొప్పున సకాలంలో చెల్లించాలని లబ్ధిదారులను కోరారు. కేడీసీసీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి మాట్లాడుతూ ప్రతి మహిళను లక్షాధికారిని చేయడమే లక్ష్యంగా సీఎం జగన్ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. రైతులు, ప్రజలకు రుణాలు అందించడంలో కేడీసీసీ ముందు వరసలో ఉంటోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, ఏలూరు జిల్లా వైఎస్సార్ సేవదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, ఏఎంసీ చైర్మన్ దండే పుష్పలత, సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంట సంధ్య, వైస్ ఎంపీపీలు మహమ్మద్ జహీర్, అగస్తీ ఆదివిష్ణు, మండలం పార్టీ అధ్యక్షుడు భట్రాజు శివాజీ, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, ఎంపీటీసీ మూడేడ్ల శశికళ, పీఏసీఎస్ అధ్యక్షుడు పంజా రాంబాబు, బొమ్మనబోయిన గోకర్ణ యాదవ్, సాగి చిన్నబ్బాయిరాజు, అంకెం నరసయ్య, శ్రీరాములు, షేక్ రఫీ, కేడీసీసీ బ్యాంకు సీఈవో ఏ.శ్యామ్ మనోహర్, కేడీసీసీ పర్సన్లు కొమ్మినేని రవిశంకర్, గుమ్మడపు రవీంద్రరాజా, తలపుల వెంకటకృష్ణారావు, గడిదేశి పెద వెంకయ్య, పడమట సుజాత, భక్యా రాణి, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ నిర్మాణానికి సహకరించండి

గుడివాడటౌన్: పట్టణంలో నిర్మించనున్న ఫ్లై ఓవర్ నిర్మాణం పనుల్లో పట్టణ ప్రజలు, అన్ని శాఖల అధికారులు సహకరించాలని డీఈ సత్యనారాయణ కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, ఇతర శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. సెప్టెంబర్ ఆరో తేదీ నుంచి నిర్మాణం పనులు ప్రారంభిస్తామన్నారు. అందుకు ప్రజల సహకారంతో పాటు అన్ని శాఖల అధికారుల సహకారం అవసరమన్నారు. ప్రత్యేకించి ఆర్అండ్‌బీ, పోలీస్ పురపాలక సంఘ అధికారులు ప్రజలకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ట్రాఫిక్ డైవర్షన్ విషయంలో పోలీసులు ఇతర రోడ్ల నిర్మాణాలు మున్సిపల్ అధికారులు విద్యుత్ తదితర శాఖల వారి సహకారం అవసరమన్నారు. ఇప్పటికే రోడ్డుకి ఇరువైపులా ఉన్న మొక్కలు విద్యుత్ స్తంభాలు తొలగించడం పూర్తయిందని డివైడర్లపై ఉన్న మొక్కలు కూడా గతంలో తొలగించారని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ పి.పద్మావతి, డీఎస్పీ సంపత్, మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌వోబీ డీఈ సత్యనారాయణ, అధికారులు

క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంపు



ఆటలు ఆడుతున్న విద్యార్థినులు



నివాళులర్పిస్తున్న స్టేడియం కమిటీ సభ్యులు

పామర్రు: విద్యార్థుల్లో క్రమశిక్షణను పెంపొందించేందుకు క్రీడలు ఎంతగానో ఉపయుక్తమవుతాయని అడ్డాడ అరవింద స్కూల్ ప్రిన్సిపాల్ రమణమూర్తి తెలిపారు. మండల పరిధి అడ్డాడ గ్రామంలో అరవింద హైస్కూల్‌లో ప్రముఖ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని క్రీడా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. గతంలో చిన్నారులు ఆడుకునే ఆటలలో ఎంతో విజ్ఞానం ఉందని, ఆ విషయాన్ని గుర్తు చేసే విధంగా పాఠశాలలోని విద్యార్థులకు గత కాలపు ఆటలను నిర్వహించామన్నారు. వీటిలో గోళీల ఆట, వంగుళ్ల దూకుళ్లు, తాడు ఆట, ఉప్పు ఆట, తొక్కుడు బిళ్ల, క్యారమ్స్, చెస్, వైకుంఠపాళి, దాడి, వావన గుంట తదితర ఆటలను విద్యార్థులతో ఆడించామని చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశామన్నారు.

గుడివాడటౌన్: పట్టణంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు స్థానిక ఎన్టీఆర్ స్టేడియం ఆధ్వర్యంలో మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని వేడుకలు జరిపారు. స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్ స్టేడియం కమిటీ సభ్యులు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్టేడియం కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు తిరుపతయ్య, దప్పలపూడి రవికుమార్, క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.

కైకలూరు: చదువుతో పాటు ఆటల్లోనూ విద్యార్థులు రాణించాలని కలిదిండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.స్వర్ణకుమారి అన్నారు. ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని పాఠశాలలో ఉత్సాహంగా నిర్వహించారు. ధ్యాన్‌చంద్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని చెప్పారు. స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ బి.కృష్ణకుమారి, ఏ.మావుల్లేశ్వరరావు, కె.రత్నదాసు, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాడవాడలా తెలుగు భాషా దినోత్సవం

అడ్డాడ(పామర్రు): గుడివాడ, పామర్రు, కైకలూరు నియోజకవర్గాల వ్యాప్తంగా తెలుగు భాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిధి అడ్డాడ గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో పద్మశ్రీ ఘంటసాల ఎన్టీఆర్ స్మారక సంగీత కళా పీఠం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయులైన వేల్పూరి సుధారాణి, కట్టా శ్రీనివాసరావు, సీహెచ్‌వీ సుబ్బారావులను ఘనంగా సన్మానించారు. తెలుగు భాష గొప్పతనాన్ని, ఔన్నత్యాన్ని వక్తలు విద్యార్థులకు వివరించారు. కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీకృష్ణ, గౌరవ అధ్యక్షుడు కోటి పాండురంగారావు, పాఠశాల హెచ్ఎం డి.పద్మ, పీఠం ప్రధాన కార్యదర్శి దగ్గుమిల్లి హరికృష్ణ, ముఖ్య సలహాదారులు పాగోలు మహాదేవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామంలోని ఏఎస్ఎం హైస్కూల్‌లో గిడుగు రామమూర్తి జయంతిని నిర్వహించారు. గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చి నిత్య వ్యవహారంలో ఉన్న భాషలోని అందాన్ని తెలియజేసిన మహనీయుడు గిడుగు అని ప్రిన్సిపాల్ ఏ.పూర్ణచంద్రారెడ్డి అన్నారు. అనంతరం రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు వి.శ్రీమన్‌నారాయణాచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.


గ్రామంలోని శాఖ గ్రంథాలయంలో తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహించారు. మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషా దేవి మాట్లాడుతూ.. చరిత్రకారుడు, సంఘ సంస్కర్త గిడుగు అని కొనియాడారు. తెలుగు భాష ప్రాముఖ్యత అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. హైస్కూల్ ఉపాధ్యాయులు మరీదు సీతారామయ్య, ఎం.శివగుణవతి, పి.వెంకట ధర్మారావు, సీహెచ్ కృష్ణ మోహన్, గ్రంథాలయ అధికారి వి.నాగ సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు. అడ్డాడ గ్రామంలోని అరవింద హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. శ్రీకృష్ణ దేవరాయుల ఆస్థానంలో అష్ట దిగ్గజాల కొలువును విద్యార్థులచే ప్రదర్శించారు. కార్యక్రమం ఆహుతులను అలరించింది. ప్రిన్సిపాల్ రమణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుడివాడటౌన్: పట్టణంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని పలుచోట్ల మాతృభాషా దినోత్సవం జరిపారు. స్థానిక హైస్కూల్‌లో విద్యార్థులచే నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. తెలుగు భాష ప్రాముఖ్యతను పాఠశాల ప్రధానోపాధ్యాయిని పి.ఎల్.నరసమాంబ విద్యార్థులకు వివరించారు. భాషపై పట్టు సాధించాలంటే కవితలు, దినపత్రికలు చదవాలని ఆమె విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: తెలుగు భాషోద్యమకారుడు గిడుగు రామమూర్తి జయంతి వేడుకలను మండలంలోని బొడ్డపాడు ఎంపీయూపీ పాఠశాలలో మంగళవారం ఘనంగా జరిగాయి. రామమూర్తి చిత్రపటానికి సర్పంచ్ మూడే శివశంకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు భాష అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. తెలుగు భాషపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయరాజు, ఉపాధ్యాయులు సుమలత, రమాదేవి, హేమలత, నాగబాబు, దేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకట నారాయణకు సన్మానం

కైకలూరు: తెలుగు భాష అమ్మ వంటిదని ప్రముఖ సాహితీవేత్త చింతపల్లి వెంకట నారాయణ అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా భుజబలపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎస్.లక్ష్మీ రాజేశ్వరీ, తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ బి.వి జయప్రసాద్, వివి.రాజారావు, ఎస్.త్రినాథరావు, ఐ.రవికుమార్, వి.పద్మాకరరావు ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామ ప్రముఖులు సయ్యపురాజు గుర్రాజు, ముదునూరి రవిరాజులు వెంకట నారాయణను ఘనంగా సన్మానించారు. 9వ తరగతి విద్యార్థిని రమ్యశ్రీ అభినయించిన నృత్యం ఆకట్టుకుంది. ఆటపాక ఎస్ఎంఎల్ఆర్ జెడ్పీ హైస్కూల్‌లో తెలుగు భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు అన్నపూర్ణ, ఫాతిమా, అనుసూయ, మరియరాణి పాల్గొన్నారు.



అడ్డాడ జెడ్పీలో తెలుగు ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కళాపీఠం సభ్యులు

నాట్యక్షేత్రంలో తెలుగుతల్లికి నివాళి



నివాళులర్పిస్తున్న నాట్యాచార్యులు

కూచిపూడి(మొవ్వ): తెలుగు భాషా దినోత్సవాన్ని మంగళవారం మొవ్వ మండలంలో ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలోని శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్య కళాపీఠంలో, కూచిపూడి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కూచిపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఇందులో భాగంగా కళాపీఠంలో ప్రిన్స్‌పాల్ వేదాంతం రామలింగ శాస్త్రి తెలుగు తల్లి విగ్రహానికి పూల మాలలేసి నివాళులర్పించారు. నాట్యాచార్యులు డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసు, డాక్టర్ వి వెంకట దుర్గా భవాని, లైబ్రేరియన్ వైవి ఫణికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

తోట్లవల్లూరు: యువతి అదృశ్యంపై తోట్లవల్లూరు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గరికపర్రు గ్రామానికి చెందిన గోళ్ల రూపశ్రీ(20) ఈ నెల 28వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించకపోవటంతో రూపశ్రీ తల్లి గోళ్ల నాగమణి మంగళవారం ఉదయం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. యువతి అదృశ్యంపై మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.